




విద్యుత్ దీపాల వెలుగులో రామవరప్పాడు బరి





ఈడుపుగల్లు బరిలో సందడి

కోడి పుంజులు కత్తులు కట్టుకుని బరిలో దిగాయి. గెలుపుపై పందేలు పరుగులు తీశాయి. పేకాట, గుండాట వంటి జూద శిబిరాలు యథేచ్ఛగా కొనసాగాయి. షాపుల్లో విక్రయించాల్సిన మద్యం బరుల్లో ఏరులై పారింది. ఇది సంక్రాంతి సంబరాల్లో భోగి రోజున ఉమ్మడి కృష్ణాజిల్లాలో కనిపించిన దృశ్యాలు. జగ్గయ్యపేట నుంచి 'జంక్షన్' వరకు, బెజవాడ నుంచి బందరు వరకు ఎటుచూసినా కోడిపందేల సందడే సందడి. జూదాలు నిర్వహిస్తే లోపల వేస్తామని హెచ్చరికలు జారీ చేసిన పోలీస్‌శాఖ రాజకీయ బలం ముందు తలవంచింది. ఈ నేపథ్యంలో సంక్రాంతి సంబరాల ముసుగులో కోట్ల రూపాయలు చేతులుమారాయి.

కోళ్లు..కోట్లు


ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేలు

తొలిరోజు రూ.20 కోట్లపైనే..

- బరుల వద్ద బరితెగించిన 'బెల్టు'
- కంకిపాడులో పోటాపోటీగా బరులు
- పందేలకు జతగా పేకాట, గుండాట
- తెలంగాణ, ఒడిశా నుంచి వచ్చిన సందర్శకులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం): ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో తొలిరోజున రూ.20 కోట్ల వరకు పందేలు సాగాయి. తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న బూదవాడ, గరికిపాడు, జగ్గయ్యపేటల్లో సోమవారం ఒక్కరోజే రూ.కోటి వరకు పందేలు నడిచాయి. ఎన్టీఆర్ జిల్లాతో పోల్చుకుంటే కృష్ణాజిల్లాలో అత్యధిక సంఖ్యలో బరులు ఏర్పాటు చేశారు. ఇక్కడ పందేలూ అదేస్థాయిలో జరిగాయి. బాపులపాడు మండలం అంపాపురం, కంకిపాడు మండలం ఈడుపుగల్లులో భారీగా పందేలు నడిచాయి. అంపాపురంలో రూ.10 లక్షలు ఆ పైబడిన పందేలకు రెండు ప్రత్యేక బరులను ఏర్పాటు చేశారు. తొలి రోజు 11 పందేలు జరిగాయి. రూ1-5లక్షల లోపు పందేల కోసం ఐదు బరులను కేటాయించారు. తెలంగాణ ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇక్కడకు వచ్చి పెద్దఎత్తున పందేలు కాశారు. నాలుగు చిన్నబరులు, పదికిపైగా పేకాట శిబిరాలతోపాటు కేసినో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొదటి రోజున మూడు కోట్ల రూపాయల వరకు నగదు చేతులు మారింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కార్లలో పందెం రాయుళ్లు ఇక్కడకు తరలివచ్చారు. నగదు రూపంలో కాకుండా టోకెన్లు అందించి మరీ పందెం రాయుళ్లను లోపలికి అనుమతించారు. అంపాపురంలో ఉన్న బరుల వద్ద క్యాసినో నిర్వహణకు రెండు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ అనుమతి ఉన్న వారిని మాత్రమే లోపలకు అనుమతించడానికి బౌన్సర్లను ఏర్పాటు చేశారు. పేకాట, లోపల-బయట, గుండాట, కోతముక్కల జూదాన్ని నిర్వాహకులు బహిరంగంగా నిర్వహించారు.





పోటాపోటీగా బరులు

కంకి పాడు మండలంలో కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు పోటాపోటీగా బరులను ఏర్పాటు చేశారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలోని పాముల కాల్వ వద్ద టీడీపీ నాయకుడు ఏర్పాటు చేసిన బరులను ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు. పందేలు, జూదంతో బరుల వద్ద జాతర వాతావరణం కనిపించింది.

బరుల వద్ద మినీబార్‌లు

బరుల వద్ద మద్యం ఏరులై పారింది. బిర్యానీ స్టాల్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ స్టాల్స్‌ను పాటలు నిర్వహించి మరీ కేటాయించారు. సంక్రాంతి సంబరాల్లో ముక్క, మందు సాధారణం కావడంతో మద్యం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల మద్యం వ్యాపారులే ఈ స్టాల్స్‌ను నిర్వహించుకున్నారు. కొంతమంది మద్యం దుకాణాల్లో మందు కొనుగోలు చేసి సరుకును బరుల వద్దకు తీసుకొచ్చారు. అధిక ధరలకు మిగతా 8లో..



విద్యుత్ దీపాల వెలుగులో ఉప్పులూరు బరి



జూదంలో పాల్గొన్న పందేం రాయుళ్లు



కోడి పందేల బరుల వద్ద మహిళల సందడి



పటమటలో పందేల హోరు

శరవేగంగా..

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏటీసీ టవర్ పనులు

- జూన్ నెలాఖరు నాటికి అందుబాటులోకి..
- ఏర్పాటుకానున్న అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు



తుది మెరుగులు దిద్దుకుంటున్న ఏటీసీ టవర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్‌ట్రాఫిక్ సెంటర్ టవర్ (ఏటీసీ) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. విమానాశ్రయంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనుల్లో అంతర్భాగంగా ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మూడేళ్లుగా ఈ టవర్ నిర్మాణ పనుల్లో జాప్యం జరిగినప్పటికీ ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు కూడా 60 శాతం మేర పురోగతిలో ఉన్నాయి. జూన్ నెలాఖరు నాటికి టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. ఏటీసీ టవర్ నిర్మాణ పనులన్నీ పూర్తయినా ప్రస్తుతం ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. టవర్ రూఫ్ పనులు కూడా తుది దశలో ఉన్నాయి. ఏటీసీ టవర్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు ఏటీసీ టవర్ ఇచ్చే సంకేతాల ద్వారానే జరుగుతాయి. ఏటీసీ టవర్‌కు అనుసంధానంగా ఏటీసీ కాంప్లెక్స్ నిర్మించారు. ఇక్కడ కూడా ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయి. గ్లాస్ ఫిటింగ్ పనులు చేస్తున్నారు. ఏటీసీ కాంప్లెక్స్‌లో ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ తదితర విభాగాలు కొలువుతీరతాయి.

ఉత్సాహంగా పూటీ లాగుడు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల పూటీ లాగుడు పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సీనియర్, జూనియర్, న్యూ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రైతులు తమ వృషభ రాజములతో పోటీకి దిగారు. ఈ పోటీలు విశేషంగా అలరించాయి.





జోసఫ్ తంబి తిరునాళ్లు ప్రారంభం

10లో

పేరంటాలమ్మ సంక్రాంతి జాతర ఆరంభం

ఘనంగా భోగి

భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగను ప్రతి ఇంటా సోమవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి భోగిమంటలు వేశారు. చిన్నారులను అందంగా ముస్తాబు చేసి భోగి పళ్లు పోశారు. పిండి వంటలు చేస్తూ, బంధు మిత్రులతో సందడిగా గడిపారు.



చల్లపల్లిలో స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో భోగి మంటను వెలిగిస్తున్న డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు



ఉప్పలూరులో కోడిపందేల బరి



కోడూరు తూర్పు వైపు రామాలయం సమీపంలోని బరి వద్ద భారీగా నిలిపిన బైక్‌లు



ఎ.కొండూరు మండలం చీమలపాడులో సంప్రదాయ కోడిపందేలు ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, శావల దేవదత్

కాలుదువ్విన కోళ్లు

సంక్రాంతిని పురస్కరించుకుని సంప్రదాయం పేరుతో సోమవారం కోడిపందేలు జోరుగా సాగాయి. కాళ్లకు కత్తులతో పందెం కోళ్లు బరిలో కాలుదువ్వాయి. తొలి రోజైన భోగి పండుగ నాడే భారీగా నగదు చేతులు మారింది. బరుల వద్ద నిర్వాహకులు జూద క్రీడలు ఏర్పాటు చేశారు. పురుషులకు దీటుగా మహిళలు కూడా గుండాట, కోడిపందేల్లో భారీగా పందేలు కాశారు.

- బరుల వద్ద గుండాట, జూదశిబిరాలు
- తొలిరోజు భారీగా చేతులు మారిన నగదు



అంపాపురం బరివద్ద కోడి కాలికి కత్తి కడుతున్న దృశ్యం



పటమట డీమార్ట్ వెనుకవైపున బరిలో..



అంపాపురంలో నోట్ల కట్టలతో పందెంరాయుళ్లు



క్రెడిట్, డెబిట్‌కార్డులు, గూగుల్, ఫోన్‌పేలకు స్పాట్‌క్యాష్ ఇస్తామని రామవరప్పాడు బరివద్ద బ్యానర్



ఈడుపుగల్లు బరి వద్ద భారీ సంఖ్యలో నిలిపి ఉంచిన వాహనాలు



కృత్తివెన్ను మండలం మునిపెడలో విజేతకు ఇచ్చేందుకు బరి వద్ద ఉంచిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్

కృత్తివెన్ను, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విచ్చలవిడిగా బరులు ఏర్పాటు చేశారు. కోడి కాళ్లకు కత్తులు కట్టి బరుల్లో పందేలకు దించారు. జాతీయ రహదారి పక్కన కోడిపందేలతో పాటు, జూదక్రీడలు భారీగా నిర్వహిస్తున్నారు. మునిపెడ, గరిశపూడి, లక్ష్మీపురం రంగా సెంటర్, పల్లెపాలెం, లక్ష్మీపురం లాకు సెంటర్, నిడమర్రు, చినగొల్లపాలెం, కృత్తివెన్ను పల్లెపాలెం గ్రామాల్లో బరులు ఏర్పాటు చేశారు. మునిపెడలో విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, రంగా సెంటర్ బరిలో మరో బైక్‌ను బహుమతిగా ఇవ్వనున్నారు. జాతీయ రహదారి పక్కనే బరులు ఉండటంతో రహదారి పొడవునా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి.

కోడూరులో యథేచ్ఛగా..

కోడూరు: కోడూరు తూర్పువైపు ప్రభుత్వాస్పత్రి సమీపంలో రెండు బరులు, కోడూరు-నరసింహపురం రోడ్డులో ఒకటి, విశ్వనాథపల్లిలో మరొక బరిని ఏర్పాటు చేసి యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. బరుల దగ్గర రాత్రివేళ ఇబ్బంది లేకుండా ఎల్ఈడీ లైట్లు ఏర్పాట్లు చేశారు. రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. పోలీసు అధికారులకు భారీస్థాయిలో ముడుపులు అందాయని తెలుస్తోంది.

తిరువూరు నియోజకవర్గంలో భారీగా..

తిరువూరు: నియోజకవర్గంలో భారీస్థాయిలో కోడిపందేలు, జూదాలు ప్రారంభమయ్యాయి. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్‌లు సంప్రదాయక కోడిపందేలు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కోడిపందేల శిబిరాలు సందర్శించేందుకు రావడంతో స్థానిక పోలీసు అధికారులు వారితో పాటు, పందేలు జరిగే తోటల్లోకి వచ్చారు. పార్టీ నాయకులతో కలిసి తోటల్లో విందుభోజనాలు చేశారు.



కోలాహలంగా అంపాపురం బరి

కిక్కిరిసిన ప్రధాన బరి ప్రాగణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అంపాపురం బరిలో సోమవారం మధ్యాహ్నం నుంచి కోడిపందేలు భారీగా ఊపందుకున్నాయి. రెండు పెద్ద బరుల్లో పదుల సంఖ్యలో రూ.లక్షల్లో పందేలు నడిచాయి. కోట్లలో నగదు చేతులు మారింది. పేకాట శిబిరం, గుండాట, కోసు ఏర్పాటు చేయడంతో బరి ప్రాంగణం కోలాహలంగా మారింది. కె.సీతారాంపురం, బిళ్లనపల్లితో పాటు వేలేరు, సింగన్నగూడెం, కొత్తపల్లి, తిప్పనగుంట గ్రామాల్లోనూ చిన్నచిన్న బరులు ఏర్పాటుచేశారు. అంపాపురం బరి వద్ద ప్రాగణం మొత్తం కార్లతో నిండిపోయింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు తెలంగాణ, ఒడిసాకు చెందినవారు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వారు భారీగా తరలివచ్చారు. దూరం నుంచి వచ్చే వారికి నిర్వాహకులు ఆతిథ్యం ఏర్పాటు చేశారు.

టేబుల్ వద్దకే సమస్తం

పేకాట శిబిరంలో కూర్చున్నవారికి టేబుల్ వద్దకే మందు, విందు అందేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇక లోన- బయట ఆటకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన బరికి పోటీగా ఇక్కడ కూడా నగదు భారీగా చేతులు మారుతోంది. బార్లలో ప్రత్యేక బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉంచారు. ఆహారం కోసం ప్రత్యేకంగా వంటశాల ఏర్పాటుచేశారు. మాంసాహార వంటలు అందుబాటులో ఉంచారు.

పందేలు కాస్తున్న మహిళలు

కోడిపందేల బరిలో కొందరు మహిళలు రూ.లక్షల్లో పందేలు కట్టారు. గుండాట ఆడేందకూ మరికొందరు ఆసక్తి కనబరిచారు. మహిళలకు నిర్వాహకులు వీఐపీ సేవలందిస్తున్నారు.



అంపాపురం బరి వద్ద కార్లు



రామవరప్పాడు బరి వద్ద పుంజుపై నీళ్లు ఊదుతున్న పందెంరాయుడు



పటమట డీమార్ట్ వెనుక బరిలో చిన్న బజార్, పెద్ద బజార్ ఆడుతున్న ప్రజలు



మునిపెడ బరిలో పందేలు వీక్షిస్తున్న ప్రజలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గమ్మ సేవలో జస్టిస్ ఎన్.జయసూర్య

వన్‌టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం పంచహారతుల సేవలో వారు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి అధికారులు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు ఆశీస్సులు అందించారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

- అగ్నికి బైక్ ఆహుతి

వీరులపాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి పడిన వ్యక్తికి మొక్కజొన్న బొండ్లకు అంటించిన మంటలు అంటుకోవడంతో రెండు కాళ్లు కాలాయి. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. బైక్ పూర్తిగా ఆహుతయ్యింది. ఈ ఘటన జుజ్జూరులో సోమవారం జరిగింది. జుజ్జూరు గ్రామానికి చెందిన చిట్లూరి హరిబాబు బంధువుల దహన సంస్కారాలకు చిన్న డొంక రోడ్డులోని శ్మశానవాటికకు వెళ్లి వస్తుండగా మార్గం మధ్యలో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. అక్కడ మొక్కజొన్న బొండ్లు తగలబెట్టడంతో మంటలో పడ్డాడు. బైక్‌కు నిప్పంటుకుని పూర్తిగా ఆహుతైంది. హరిబాబు రెండు కాళ్లు మంటల్లో కాలాయి. త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. 108లో బంధువులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.



పూర్తిగా కాలిపోయిన బైక్

పూటీ లాగుడు పోటీలు ప్రారంభం

ఘంటసాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల పూటీ లాగుడు బల ప్రదర్శన పోటీలను ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో సీనియర్, జూనియర్, న్యూ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు బండి పరాత్పరరావు తెలిపారు. బరిని ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు ప్రారంభించారు. పోటీలను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు లాంచనాంగా ప్రారంభించారు. తొలి ప్రదర్శన ఇచ్చిన ఎడ్ల జత రైతు, సర్పంచ్ వెనిగళ్ల రామకృష్ణ ప్రసాద్‌కు కొనకళ్ల మెముంటో అందజేశారు.



ఘంటసాల హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

ముగ్గు మనోహరం

500 మీటర్ల పొడవు రోడ్డుపై 30 రంగవల్లులు

మోపిదేవి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెంలోని రావి సురేశ్ ఇంటి వద్ద సిమెంట్ రోడ్డుపై ఆయన సతీమణి జయశ్రీ 500 మీటర్ల పొడవునా 30 రకాల రంగవల్లులను సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బంధుమిత్రులతో కలసి తీర్చిదిద్దారు. రెండు రోజులు పగలూ, రాత్రి కష్టపడి రూ.25 వేలు ఖర్చు పెట్టి ముగ్గులు వేసినట్లు జయశ్రీ తెలిపారు. టీడీపీ గుర్తు, ఎన్టీఆర్ విగ్రహం, ధాన్య లక్ష్మి ఆకారంలో తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పురాతన నాణేలు కూడా రంగవల్లుల్లో ఉంచి సుందరంగా తీర్చిదిద్దారు.



రావివారిపాలెంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న రావి సురేశ్ కుటుంబసభ్యులు,



ఆకట్టుకుంటున్న టీడీపీ చిహ్నం

కోళ్లు..కోట్లు

(7వ పేజీ తరువాయి)

ఈ మద్యాన్ని విక్రయించడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించారు.

- గుడివాడ నియోజకవర్గంలోని గౌతమ్ స్కూల్ వెనుక, బొమ్ములూరు, నందివాడ మండలం నందివాడ, పుట్టగుంట, పోలుకొండ, రుద్రపాక శివారుగొల్లగూడెం, తమిరిశలలో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహించారు.. గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు, కౌతవరం, డోకిపర్రు, కూరాడ, కుచ్చికాయలపూడిలో బరులు ఏర్పాటు చేశారు. బరులవద్ద టోకెన్లు ఇచ్చి మరీ పేకాటలు నిర్వహించారు.
- మచిలీపట్నంలోని మేకావానిపాలెం, గోపువానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం, రుద్రవరంలో బరులను ఏర్పాటు చేశారు. పేకాట కోసం ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేసి టోకెన్లు అందించి మరీ పేకాటను ఆడించారు. కోడిపందేల బరులకన్నా గుండాట శిబిరాలను అధికంగా ఏర్పాటు చేశారు.
- పెడన నియోజకవర్గంలో తోటమూల, కొంకేపూడి, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, అర్తమూరులో కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేశారు. బంటుమిల్లి, పెందుర్రు, నాగేశ్వరరావుపేట, తుమ్మిడి తదితర ప్రాంతాల్లో బరులు సిద్ధం చేశారు. గూడూరు మండలం గూడూరు-పెడన రహదారి వెంబడి, పోసినవారిపాలెంలో బరులు ఏర్పాటు చేసి జోరుగా పందేలు, పేకాట శిబిరాలను కొనసాగించారు.
- అవనిగడ్డ నియోజవర్గంలోని పులిగడ్డ, పులిగడ్డపల్లెపాలెం, అవనిగడ్డ, పాతఎడ్లంక, గొట్టంమిల్లుల వద్ద బరులు ఏర్పాటు చేశారు. నాగాయలంక మండలంలో పాలిటెక్నిక్ కళాశాల పక్కనే కోడిపందేల బరిని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. నియోజకవర్గంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, కోడూరు, నాగాయలంక మండలాల్లో 20కిపైగా కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేశారు.
- పామర్రు నియోజకవర్గంలో కొత్తపెదమద్దాలి, పెదపారుపూడిమండలం యలమర్రు, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం, హనుమంతపురం, మొవ్వమండలం కోసూరు, భట్లపెనుమర్రు, తోట్లవల్లూరు మండలం గరికపర్రు, కొమ్మమూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరులో కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

అపూర్వ కలయిక..

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యులందరూ కలిసి పండుగ చేసుకోవడం నేటితరానికి ఆదర్శం. హనుమాన్‌జంక్షన్ రైల్వే గేటు వద్ద నివసిస్తున్న పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు కలయికతో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరిగిందని పల్నాటి పెదమస్తాన్, చోడే సుబ్బారావు తెలిపారు.


సంక్రాంతి సందర్భంగా కలిసిన చోడే, పల్నాటి కుటుంబ సభ్యులు



బరి తెరిచారు

- పోటా పోటీగా కోడిపందెం శిబిరాలు
- పోటెత్తిన ప్రజలు.. కిటకిటలాడిన బరులు
- చేతులు మారిన కోట్లరూపాయలు

కంకిపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అన్నారు. మండలంలోని ఉప్పలూరులో ఏర్పాటు చేసిన కోడి పందెం శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఎడ్ల ప్రదర్శనను తిలకించారు. కాసేపు అక్కడే ఉండి కోడి పందేలను తిలకించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కోడి పందెం, జూదం శిబిరాలు సందర్శకులు, పందెం రాయుళ్లతో కిటకిటలాడాయి. కంకిపాడులో జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. అదే విధంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు, ఉప్పలూరు, కంకిపాడు, గొడవర్రు, నెపల్లి గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు తిలకించేం దుకు తరలివచ్చారు. ఉప్పలూరు, గొడవర్రు గ్రామాల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు కూడా ప్రజలు అదే తరహాలో తిలకించేందుకు తరలివచ్చారు. కంకిపాడులో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో జబర్దస్త్ నటులు రాకెట్ రాఘవ హల్‌చల్ చేశారు.


ఆకునూరులో కోడిపందేలు


జక్కంపూడి కోడిపందేల బరిలో ఎంపీ కేశినేని శివనాథ్

ఉయ్యూరు : మండల పరిధి ఆకునూరు, కాటూరులో సోమవారం కోడిపందేలు జోరుగా సాగాయి. మాగాణి భూముల్లో పెద్దయెత్తున బరిలు, టెంట్‌లు వేసి కోడిపందేలు, పేకాట, జూదం యథేచ్ఛగా నిర్వహించారు. పెద్ద బరుల్లో రూ. 50వేల నుంచి లక్షకు పైగా పందేలు వేయగా లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పందేలు తిలకించేందుకు మహిళలు,యువతులు తరలివచ్చి గ్యాలరీల్లో కూర్చుని ఆసక్తి చూపారు. కొందరు మహిళలు పందేలు కాయగా మరి కొందరు కాయ్‌రాజాకాయ్, చిన్న పెద్ద బజార్లు ఆడారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు, పేకాట జరిగాయి.


గన్నవరం మండలంలో..


కంకిపాడులో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరి

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో భోగి రోజైన సోమవారం కోడిపందేలు కోలాహలంగా జరిగాయి. కోడిపందేల నిర్వాహణపై అధికారులు ఎన్ని ఆంక్షలు విధించినా నిర్వాహకులు ఎక్కడా తగ్గలేదు. మండలంలోని పలు గ్రామాల పరిధిలో పోటా పోటీగా బరులు సిద్ధం చేయడంలో సమీప గ్రామాలతో పాటుగా నగరంలో నుంచి వేల సంఖ్యలో జనం హాజరై పందాలను తిలకించారు. మండలంలోని ఒక్క అంబాపురం పరిధిలోనే మూడు బరులు ఏర్పాటు కాగా జక్కంపూడి పరిధిలో ఒక బరి ఏర్పాటు చేశారు. కోడిపందేల తో పాటుగా పేకాట, చిన్నబజార్, పెద్దబజార్, గుండాట యథేచ్ఛగా జరిగాయి. స్థానిక జక్కంపూడి పాముల కాలువ వద్ద టీఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరచూరి ప్రసాద్ ఏర్పాటు చేసిన పందెం బరికి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హాజరైయ్యారు.

గన్నవరం : మండలంలో పలు చోట్ల కోడి పందేలు, పేకాట జోరుగా సాగుతున్నాయి. సూరంపల్లి, గోపవరపుగూడెం, పురుషోత్తపట్నం రైల్వే గేటు సమీపంలో, చెంచుల కాలనీ, తెంపల్లి, చిన అవుటపల్లి, మర్లపాలెం గ్రామాల్లో కోడి పందేల బరులు నడుస్తున్నాయి. అక్కడ కోడి పందేలు, పేకాటతో పాటు మద్యం కూడా యథేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయి. లక్షలు చేతులు మారుతున్నాయి. గెలిచి నోడు ఆనందంతో, ఓడినోడు బాధతో వెళుతున్నారు. పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. బరులు సిద్ధం చేసే ముందు హడావిడి చేసిన పోలీసులు పత్తా లేరని విమర్శలు వినిపిస్తున్నాయి.



సందడిగా భోగి

ఉయ్యూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు పట్టణం, మండల పరిధి గ్రామాల్లో సోమవారం భోగి పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వాకిళ్లలో మహిళలు రంగు రంగుల ముగ్గులు వేసి భోగి పండుగకు స్వాగతం పలికారు. కూడళ్లలో వేకువజామున భోగి మంటలు వేసి చిన్నా పెద్ద తేడా లేకుండా సందడి చేశారు.

ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభంగా నిర్వహించారు. బోగిమంటలు, గాలిపటాలు, గంగిరెద్దులు ఆటలతో పిల్లలు, పెద్దలు సందడిగా గడిపారు. అసోసియేషన్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, పూర్ణచంద్రరావు, బాపిరాజు, కిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలో భోగి పండుగను సందడిగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు ఝాము నుంచే గ్రామాల్లోని వీధుల్లో, ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, నాయకులు శ్రీనివాసరావు, చిమట రామారావు, వెంకయ్య జగదీశ్వరరా వు, అర్జునరావు, శ్రీనివాసరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గన్నవరంలో భోగి మంటలు వేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


భోగి మంటలు వేస్తున్న ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పుట్టగుంట ఫామ్‌హౌస్‌లో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : చెడును విస్మరిస్తూ అవాంఛిత వస్తువులను మంటలో వేయడం ద్వారా గతాన్ని కాల్చివేసి ఉజ్వల భవిష్యత్తుకు స్వాగతం పలికేందుకు భోగి మంటలని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని పుట్టగుంట ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులతో, మాజీ ఎంపీ మాగంటి బాబుతో కలిసి సోమవారం నిర్వహించిన భోగిమంటల సంబరాలు అంబరాన్నంటాయి. ప్రాగణం అంతా రంగవల్లులతో తీర్చిదిద్ది హరిదాసు భజనలతో, గంగిరెద్దు విన్యాసాలతో అంగరంగ వైభవంగా భోగి సంబ రాలు నిర్వహించారు. పుట్టగుంట కుమార్తె అన్విత, కుమా రుడు ఆతీష్ అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించారు.

● సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడమే సంక్రాంతి సంబరాల ఉద్దేశమని ఎన్ఎస్పీ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. సింగన్నగూడెంలో ఆర్ఆర్‌డీఎస్(రంగన్నగూడెం రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఆర్ఆర్‌డీఎస్ అధ్యక్షుడు తుమ్మల ధశరధరామయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో బెజవాడ వెంకట కృష్ణారావు, మొవ్వా వేణుగోపాల్, కసుకుర్తి అర్జునరావు, పల్లగాని వీరాంజనేయులు, మరీదు రాము, యడవల్లి స్వామి, గరికపాటి వరప్రసాద్, దువ్వూరి దావీదు, తదితరులు పాల్గొన్నారు.


పుట్టగుంట ఫామ్‌హౌస్‌లో..



ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


గన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు సందడిగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు పెద్ద ఎత్తున మహిళలు వచ్చారు. న్యాయనిర్ణేతలుగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్రా ఉమావతి, విశ్రాంత ఉపాధ్యాయుడు దావినేని సాంబశివరావులు వ్యవహరించారు. సంక్రాంతి పండుగ శోభను సంతరించుకునే విధంగా రంగురంగు రంగవల్లికలను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కాసన్నేని వెంకటేశ్వరరావు(నాని), జాస్తి శ్రీనివాసరావు, కొడాలి ఈశ్వర ప్రసాద్, జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసకల్యాణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : వేలేరు వేద గార్డెన్స్‌లో వేములపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కనుల పండువగా శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాసుని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీటీడీ అర్చకులు సూర్యకుమారాచార్యుల ఆధ్వర్యంలోని 18మంది అర్చకులు సోమవారం శ్రీనివాస కళ్యాణాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మధుపర్క సమర్పణ, మహాసంకల్పం, మంగళ సూత్రధారణ ఘట్టాలను విశేషాలతో వివరిస్తూ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో దాత వేములపల్లి శ్రీరామ్, అర్చన దంపతులు శ్రీనివాసకళ్యాణాన్ని నిర్వహించారు. వేములపల్లి సత్యనారాయణ దంపతులు, వేములపల్లి శ్రీహరి దంపతులు, వేములపల్లి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు, ఆళ్ల గోపాలకృష్ణ, బొబ్బా వీరరాఘవరావు, మూల్పూరు వెంకటరత్నం, అట్లూరి రమేష్, తదితరులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


వేలేరు వేద గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు సూర్యకుమారాచార్యులు

















దుర్గగుడిలో శాస్త్రోక్తంగా భోగిమంటలు

వన్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సంక్రాంతి సంబరాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈవో కే రామచంద్ర మోహన్ పర్యవేక్షణలో స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు, వేదపండితులు చిన్నరాజగోపురం వద్ద ఉన్న ప్రాంగణంలో పూజలు నిర్వహించగా, ఈవో, డిప్యూటీ ఈవో భోగిమంటలు వెలిగించి వేడుకలు ప్రారంభించారు. అనంతరం మహామండపం 7వ అంతస్తులోని పెద్ద రాజగోపురం ఎదురుగా బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. సంక్రాంతి సంబరాల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో డిప్యూటీ ఈవో బొమ్మల కొలువును పరిశీలించారు. సంక్రాంతి సంబరాలు కావటంతో ప్రాంగణాన్ని రంగవల్లికలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





భోగి మంటలు వెలిగిస్తున్న ఈవో రామచంద్రమోహన్, సీపీకి అమ్మవారి చిత్రపటం ఇస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో సీపీ

సంకాంత్రి పండుగను పురస్కరించుకుని దుర్గగుడిలో దుర్గమ్మను సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా, అర్చకులు సీపీ కుటుంబానికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అం దజేశారు.

దుర్గమ్మకు వెండి గిన్నెల పాత్ర కానుక

గుంటూరు ద్వారకానగర్‌కు చెందిన చాయంరెడ్డి శ్వేత, భవిత అమ్మవారికి 2,860 గ్రాముల బరువున్న అయిదు గిన్నెల వెండి నివేదన పాత్రను కానుకగా అధికారులకు అందజేశారు. అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

కృష్ణలంక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలు, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో కృష్ణలంకలోని 21వ డివిజన్‌లో సుందరయ్య గ్రంథాలయం వద్ద, సత్యం హోటల్ సెంటర్‌లో సోమవారం భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిందొకటి, ఇప్పుడు చేస్తోంది మరొకటి అని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఆరు నెలల్లోనే ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు, సర్వీస్ చార్జీల పేరుతో రూ.16వేల కోట్లు భారం మోపారని, దీంతో వినియోగదారులపై రెట్టింపు భారం పడిందని దుయ్యబట్టారు. తక్షణమే భారాలను ఉపసంహరించుకోవాలని, అదనపు భారాలను రద్దు చేయాలని, విద్యుత్ సంస్థలకు అప్పులుంటే వాటికి మించి అప్పులు ప్రజలకున్నాయని నిత్యావసర వస్తువుల భారాలకు తోడు విద్యుత్ భారాలు మోయలేనివిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను నిరంతరం దోపిడీ చేస్తూ భారాలు మోపేందుకు స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని, అదానీ స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలో పెట్టకుండా ఉండాలా చూడాలని, ఇప్పటికే పెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. అదానీతో చేసుకొన్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ప్రజలపై భారాలు మోపే సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేసేంత వరకు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. నేతలు పుప్పాల కృష్ణ, కళ్యాణ్, మాగంటి హరిబాబు, కోరాడ రమణ, గోపి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దగ్ధం చేస్తున్న సీపీఎం నేతలు



ఎంపీ కార్యాలయంలో భోగి మంటలు వెలిగిస్తున్న కేశినేని శివనాథ్, టీడీపీ నేతలు

చంద్రబాబు నాయకత్వంలో రోజూ పండుగే

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిపరంగా రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగ వాతావరణం నెలకొందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురునాక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఎంపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భోగి వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఆయన సతీమణి జానకిలక్ష్మితో కలిసి భోగిమంటలు వెలిగించారు. అనంతరం ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్నారులకు భోగి పండ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లేని విధంగా సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి చేసుకోవటానికి వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల హామీలన్నింటినీ ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉద్యోగులకు సంక్రాంతి పండగ ముందు పాత బకాయిలను చెల్లించామన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాల్లో మరింత పురోగతి సాధిస్తాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ పాలు పంచుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పార్టీ నేతలు గన్నే ప్రసాద్, చెన్నుపాటి గాంధీ పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ షాపు యజమానికి కోటి పన్ను నోటీసు!

- జీఎస్టీ నెంబరుపై 66 కోట్ల లావాదేవీలు
- చిరు వ్యాపారిని మోసం చేసిన అకౌంటెంట్
- ఆయన నెంబర్‌పై అక్రమ లావాదేవీలు
- ఏలూరు జిల్లాలో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్న ఓ చిరువ్యాపారికి కోటి రూపాయలు పన్ను చెల్లించాలని అధికారులు నోటీసు ఇచ్చారు. తన జీఎస్టీ నెంబర్‌పై కోట్లాది రూపాయల వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్టు నోటీసుల్లో పేర్కొనడంతో విస్తుపోయాడు. ఆ వ్యాపారి ఖాతాలను నిర్వహించే అకౌంటెంట్ మోసానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన జీఎస్టీ నెంబరుపై పే బిల్స్ జనరేట్ చేసి అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్టు తేలింది. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి పంచకర్ల విజయబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. జీఎస్టీ నెంబరు కోసం గత ఏడాది మార్చి 23న విజయవాడకు చెందిన అకౌంటెంట్ బిల్లా కిరణ్‌కు విజయబాబు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజు ఫొటో ఇచ్చారు. అప్పటి నుంచి తన వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అకౌంటెంట్ కిరణ్‌కు విజయబాబు ఫోన్‌లో చెప్పేవారు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది ఆగస్టు 3న సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ శ్రీహరిపురంలోని కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేశారు. విజయబాబు జీఎస్టీ నెంబరుపై రూ.66.66 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని, ఇందుకు సంబంధించి సుమారు కోటి వరకు పన్ను చెల్లించాలని నోటీసు ఇచ్చారు. దీంతో విస్తుపోయిన విజయబాబు అంత పెద్ద మొత్తంలో వ్యాపార లావాదేవీలు చేయలేదని తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక సచివాలయ ఉద్యోగితో పంచనామా రిపోర్టు కూడా తయారు చేయించారు. తన జీఎస్టీ నెంబరుపై అక్రమంగా కోట్లలో లావాదేవీలు నిర్వహించటంపై తన అకౌంటెంట్ కిరణ్‌ను గత ఏడాది నవంబరు 25న విజయబాబు నిలదీశారు. తప్పు జరిగిందని పన్ను బకాయిలు చెల్లించే బాధ్యతను తానే తీసుకుంటానని కిరణ్ అంగీకరించాడు. అయితే ఇప్పటి వరకు అకౌంటెంట్ పన్ను కట్టలేదు. సేల్స్ టాక్స్ పన్ను బకాయి చెల్లింపునకు ఇచ్చిన గడువు దాటిపోయింది. దీంతో విజయబాబు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో అగ్నికీలలు

- షార్ట్ సర్క్యూట్‌తో ఎగసిపడ్డ మంటలు
- సురక్షితంగా బయటపడ్డ అమెరికా దంపతులు
- రెండు గంటలపాటు శ్రమించిన పోలీసు, ఫైర్



హోటల్‌లో ఎగసిపడుతున్న మంటలు

తడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా తడ సమీపంలోని బోడిలింగాలపాడు జాతీయ రహదారి పక్కనున్న స్మార్ట్‌సిటీ స్టార్ హోటల్‌లో సోమవారం ఉదయం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ప్రధానంగా మూడో అంతస్తులో దట్టమైన పొగతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ అంతస్తులో ఉదయం 9 గంటల ప్రాంతంలో అమెరికాకు చెందిన డేవిడ్, జెల్లి దంపతులు, చెన్నైకు చెందిన గ్రైడ్స్ డిక్రోస్, షిబా రెండు గదులు తీసుకున్నారు. వీరి గదులను పొగ కమ్మేయడం.. తలుపులు లాక్ అయిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆ రెండు గదుల్లోని అద్దాలను పగలగొట్టి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో డిక్రోస్ చేతులకు గాయాలయ్యాయి. రెండు గంటలపాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పగలిగారు.

ఘనంగా జోసఫ్ తంబి తిరునాళ్లు ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ కతోలిక పుణ్యక్షేత్రంగా పేరొందిన పెద అవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో మూడు రోజులపాటు (13,14,15 తేదీలు) వైభవంగా నిర్వహించే దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు (తిరునాళ్లు) పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన గురువుగా విచ్చేసిన ఎనికేపాడు మేరీమాత కపూచియన్, ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రొవిన్షియల్ రెవ.ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు ఉదయం 7గంటలకు ఇతర గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గురువులు, గుడిపెద్దలు, సంఘపెద్దలు తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గురువులందరూ పూజావస్త్రాలు ధరించి బ్యాండుమేళాలతో దేవాలయంనుంచి ప్రదక్షిణగా కళావేదిక వద్దకు చేరుకుని సమష్టి దివ్యబలిపూజను సమర్పించారు. తంబి ధన్య జీవితం, దైవరాజ్య సువార్త ప్రకటన గురించి ఫాదర్ మరియదాసు తన ప్రసంగంలో వివరించారు. రెవ.ఫాదర్ జోసఫ్ తంబి ఆధ్వర్యంలో పునీత జోజప్ప దేవాలయం, ముసునూరు గాయక బృందం పూజాపాటలను ఆలపించగా, ఉదయం 9గంటలకు విజయవాడ మేత్రాసన జ్యోతిర్మయి మాత ఉపదేశుల బృందం మృత్యుంజయుడు అనే బుర్రకథ నిర్వహించారు. ఉదయం పదిన్నరకు ఎనికేపాడు ప్రొవిన్షియల్ సెక్రటరీ రెవ.ఫాదర్ బీమ్లా ప్రేమ్ కుమార్, మధ్యాహ్నం రెండున్నరకు మండడం సహాయక గురువులు రెవ.ఫాదర్ దాసరి జోసఫ్ తంబి దివ్యబలి పూజలను సమర్పించారు. సాయంత్రం 5 గంటలకు అమెరికాకు చెందిన రెవ.ఫాదర్ గుడె ఉదయ మీన వరప్రసాద్ సమష్టి దివ్యబలిపూజ సమర్పించారు. రాత్రి 10.30 గంటలకు లూర్దుమాత నాట్యమండలి గన్నవరం వారిచే ప్రదర్శించబడిన యేసు-బరబ్బా అనే బైబిల్ నాటకం భక్తులను విశేషంగా అలరించింది. ఈ ఉత్సవాల్లో అనేకమంది గురువులు, సిస్టర్లు, విశ్వాసులు, తంబి భక్తులు పాల్గొన్నారు.



సమష్టి దివ్యపూజాబలి సమర్పిస్తున్న ఫాదర్ మరియదాసు

పటిష్ట చర్యలు

మూడు రోజులపాటు జరిగే తంబి తిరునాళ్లకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఆలయ ప్రాంగణంలో అవుట్‌పోస్ట్ ఏర్పాటుచేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. మెడికల్, అంబులెన్స్, ఫైర్ వంటి అత్యవసర సేవలు అందుబాటులో ఉంచారు. సుమారు 300 మంది పోలీసులు, 200 మంది వలంటీర్లు భక్తులకు అవసరమైన సేవలందిస్తున్నారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు సారథ్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. క్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ మాట్లాడుతూ తిరునాళ్లకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, ఆలయ కమిటీ పెద్దలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కోరారు. ముఖ్యంగా మంచినీరు, టాయిలెట్లు, శానిటేషన్, విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజ్ఞప్తిచేశారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన జస్టిస్ చల్లా గుణరంజన్



రాప్తాడు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ సోమవారం సందర్శించారు. ఆయనకు మౌనగిరి వ్యవస్థాపకులు ఈశ్వరయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. క్షేత్రంలోని 39 అడుగుల ఏకశిలా హనుమన్ విగ్రహాన్ని జడ్జి దర్శించారు.



శ్రీవెంకమ్మ పేరంటాల అమ్మవారు

పేరంటాల అమ్మవారి సంక్రాంతి జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రసాదంపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానంలో సంక్రాంతి జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజులో భాగంగా దేవస్థానం ప్రాంగణంలో భోగి మంటలు వెలిగించారు. అనంతరం గణపతి పూజతో జాతర మహోత్సవాలు మొదలైయ్యాయి. అనంతరం అమ్మవారికి విశేషంగా అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారసులు భోగి పళ్లతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో పీ ప్రియాంక తెలిపారు.



గొల్లపూడి స్కూల్‌లో ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గొల్లపూడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలోని శ్రీ పోసాని నరసింహారావు చౌదరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల క్రితం విద్యనభ్యసించిన 1975 టెన్త్ బ్యాచ్ పాఠశాలలో స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు హనుమంతరావు, వెంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అమరులైన ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులకు నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు మార్కెటింగ్ యార్డ్ మాజీ ఛైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ, గాంధీ కో.ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, సుబ్బారావు, సుధీర్, శ్రీనివాస్, శివ రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రోవెన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పటమట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాంట్ ఫోర్ట్ బ్రదర్స్ ఆఫ్ సెయింట్ గాబ్రియెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రోవెన్స్‌కు చెందిన వివిధ పాఠశాలల మూడో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పటమటలోని ఎంఎస్ఎం పాఠశాలలో సోమవారం జరిగింది. హైదరాబాద్ ప్రోవెన్స్‌కు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, నాగపూర్ సెక్టార్ పరిధిలోని 15 పాఠశాలల్లోని సుమారు 150మంది విద్యావేత్తలు, బ్రదర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనం హైదరాబాద్ ప్రోవెన్స్ సుపీరియర్ రెవ.బ్రదర్ షైన్ అలెక్స్ ఆధ్వర్యంలో విద్యా సంబంధ అంశాలు, సామాజిక అంశాలు వంటి విషయాలపై చర్చించి ప్రణాళికలు రూపొందించారు. ఏఎల్‌సీఏఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కస్తూరి శివ శంకర్, మేనేజ్‌మెంట్ కన్సల్‌మెంట్ రిసోర్స్ పర్సన్ ఎంసీ దాస్, పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ రాయప్ప రెడ్డి, ఎన్.ఎస్.ఎమ్ పూర్వ విద్యార్థుల ప్రెసిడెంట్ ఎన్.వెంకట జగదీష్ పాల్గొన్నారు.



పటమటలో జరిగిన హైదరాబాద్ ప్రోవెన్స్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

లబ్బీపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ముగింపు సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ గోదాదేవి, శ్రీ రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం కన్నుల పండుగగా జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు భారీగా పాల్గొని కల్యాణాన్ని తిలకించి పరవశించారు. ఆలయం నుంచి ఊరేగింపుగా మండపానికి స్వామివార్లను తీసుకువచ్చిన పండితులు అంగరంగవైభవంగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బరి తెగించి

విజయవాడ నగర శివార్లు జన జాతరను తలపించాయి. సంక్రాంతి సంబరాల పేరిట కోడి పందేలను నిర్వహించారు. వీటితోపాటు ఇతర జూదక్రీడలు కూడా యథేచ్ఛగా నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు తరలివచ్చారు. మద్యం ఏరులై పారింది. పోలీసు అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా షరా యథావిధిగా పందేలు సాగాయి



పటమట





ఈడుపుగల్లు



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

శివ ముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు

కూచిపూడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శివ ముక్కోటి సంద ర్భంగా మండల పరిధిలోని పలు దేవాలయాల్లో విశేషపూజలు నిర్వహిం చారు. కోసూరు దుర్గా నాగేశ్వరస్వామి ఆలయంలో దేవాలయ ధర్మకర్త గుత్తికొండ రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు గూడూరు రామకృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి, చినముత్తేవి సోమేశ్వ రస్వామి, కోసూరు దుర్గానాగేశ్వరస్వామి ఆలయాలతోపాటు మొవ్వ, నిడు మోలు, పెదపూడి తదితర దేవాలయాల్లో విశేషపూజలు జరిగాయి.



పేకాట శిబిరంపై దాడి

గుడివాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరానగర్‌కాలనీలో బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం వన్ టౌన్ పోలీసులు దాడి చేసి 10మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.18500లు స్వాధీనం చేసుకున్న ట్లు సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ముగ్గుల పోటీలు

పమిడిముక్కల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అమీనాపు రం రామకృష్ణ గీతామందిరం వద్ద మాజీ ఎంపీటీసీ పోరంకి ప్రకాశవర్మ తన తాత ప్రకాశ రాజు జ్ఞాపకార్థం మహిళలకు సోమవారం ముగ్గుల పోటీ లు నిర్వహించి విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులు తీర్చిదిద్దారు.



డోకిపర్రులో భోగి మంటల వద్ద ఎమ్మెల్యే రాముతో ఎన్నారైలు



కపిలేశ్వరపురంలో భోగి మంటలు వేస్తున్న టీడీపీ నాయకుడు తాతినేని రమేశ్



మందపాలెంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న గ్రామస్థులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సీపీఎం

గుడివాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచిందని గగ్గోలు పెట్టి, నేడు అధికారంలోకి వచ్చాక ఆరునెలల వ్యవధిలో నూరు శాతం విద్యుత్ బిల్లులను పెంచిందని సీపీఎం మం డల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక చెంచుకాలనీలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రేపాని కొండ, నారాయణ, నాంచారమ్మ, బత్తుల నాగరాజు, చల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు పలు గ్రామాల్లో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దహపం చేసి నిరసన తెలిపారు. మొవ్వ శివారు నరసన్నపాలెం, కాజ శివారు మందపాలెం, నిడుమోలు, అవిరిపూడి తదితర గ్రామాల్లో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, విద్యుత్ వినియోగదారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

భోగి వేడుకల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పామర్రులో సోమవారం భోగి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భోగి వేడు కను కూటమి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, విశ్రమ దంపతులు ప్రారంభించారు. ఈ సంబ రాల్లో మహిళలతో కలిసి ఎమ్మెల్యే సతీమణి విశ్రమ చేసిన కోలాట నృత్యాలతోపాటు, గంగిరెద్దుల విన్యా సాలు, హరిదాసుల కీర్తనలు, పిట్టలదొర చేసిన సందడి అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాస్, మండపాక శంకర్‌బాబు, కోటి పాండు, వీరంకి వెంకటేశ్వరరావు, కాకరాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని పేరిశేపల్లి కృష్ణం వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు చెరుకూరి కృష్ణమూర్తి, మంజుల దంపతులు ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు, డోకిపర్రుల్లో భోగి వేడు కలు ఘనంగా నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెని గండ్ల రాము ముఖ్య అతిథిగా పాల్గొని భోగి మంటలు వెలిగించారు. గ్రామస్తులు విదేశాల నుంచి, హైద రాబాద్, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ ప్రవాసులు అందరూ భోగిమంటల వద్ద సందడి చేశారు.

● కౌతవరం షిర్డిసాయి మందిరం నిర్వాహకులచే సోమవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. ముగ్గులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తిలకిం చారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కానూరి బాలకృష్ణ మోహన్(బాలు), కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ సుబ్బారా వు (బాబూరావు), కౌతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి బొప్పన సుష్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : మండలంలోని పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఆటల పోటీలను సోమవారం ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు ప్రారంభిం చారు. మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు, గంట బాలవర్ధన్, మరీదు మౌళి, యారగాని శివశంకర్, కొల్లి పర నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : కపిలేశ్వరపురంలో తాతినేని ఫౌం డేషన్ అధిపతి తాతినేని రమేశ్, పలువురు ఎన్నారైలు భోగిమంటలు వేసి ఆనందంతో సందడి చేశారు.

గుడివాడ : అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో వాంబే కాలనీలో సోమ వారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిం చారు. బాలికలకు లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతు లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రేపాని కొండ, నాయకులు నారాయణ, సమీర్, కాలనీ వాసులు శ్యామల, లక్ష్మీ, గంగ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : గుడివాడ మండలంలో భోగి వేడుకలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భోగి మంటలు వేసి సందడి చేశారు.

పెదపారుపూడి : సంక్రాంతి పండుగలో మొదటి రోజును భోగి పండుగ పెదపారుపూడి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కుటుంబసభ్యులతో కలసి గ్రామాల్లో ఉదయాన్నే భోగి మంటలు వేసి, ఇంటి ల్లిపాది స్నానాలు ఆచరించి పిండి వంటలు చేసుకుని సందడిగా గడిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మిత్రులతో సందడిగా గడిపారు.



పామర్రు ఎన్టీఆర్ విగ్రహం వద్ద భోగి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, విశ్రమ దంపతులు



యాకమూరు బస్‌షెల్టర్ వద్ద కేసీపీ కార్మిక సంఘం నేత దివంగత చొప్పరపు సుబ్బారావు విగ్రహం వద్ద బాల్య మిత్రులు

బాల్య మిత్రులను కలిపిన సంక్రాంతి

తోట్లవల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి బాల్య మిత్రులను కలి పింది. తోట్లవల్లూరు మండలం యాకమూరులో పుట్టి పెరిగి ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఈ సంక్రాంతికి తమ గ్రామానికి వచ్చి సోమవారం గణేష్ యూత్ పేరుతో ఒకే వేదికపై అందరు కలుసు కుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్నపుడు తాము చదువుకున్న పాఠ శాలను సందర్శించి ఆటలాడుకున్న మైదానాన్ని గుర్తు చేసుకున్నారు. బస్టాండ్ వద్ద కేసీపీ కార్మిక సంఘం నేత దివంగత చొప్పరపు సుబ్బారావు విగ్రహాన్ని సందర్శించి చిన్ననాటి మధురానుభూతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు.

● కోదండ రామాలయం అభివృద్ధికి ఫిక్సిటి గ్రూప్ కంపెనీస్ సీఈవో(యుఎస్ఏ) వెలివెల వినయ్ రూ. 3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. వినయ్ మాట్లాడుతూ, యు ఎస్ఏలో ఐటీ పరంగా తనకు పది కంపెనీలున్నాయని, ఇంజనీరింగ్ చదివి ఉద్యోగాల కోసం అన్వేషించే వారు తనను సంప్రదిస్తే ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తానని, ఎవ్వరికి ఎలాంటి అవసరం ఉన్నా తనవంతు సహాయం చేస్తానని వినయ్ పేర్కొ న్నారు. ఇంకా చొప్పరపు సుబ్రహ్మణ్యం, సుధీర్, రాజేష్, నాగేంద్రరావు, కిరణ్, నరసిం హారావు, చిన్ని, శరత్‌గోపి, సుబ్బారావు తదితర బాల్య మిత్రులు కలుసుకున్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామర్రు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ- మచిలీపట్నం ప్రధాన జాతీయ రహదారిపై మండల పరిధిలోని కొండిపర్రు అడ్డరోడ్డు సమీపంలోని ఫ్లైఓవర్ వంతెన వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు అదుపు తప్పి రహదారి ఫ్లైఓవర్ వంతెను ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న బంద రుకు చెందిన ఉన్నం అశోక్‌గాంధీ (57) సయ్యద్‌బాషా (53) ముంతాజ్ ఖుష్బూ (36) గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరు కుని గాయపడ్డ వారిని బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.



గాయపడినవారిని బందరు తరలిస్తున్న 108 సిబ్బంది

జూదశిబిరాలపై చర్యలు తీసుకోవాలి

గుడివాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహిస్తున్న కోడిపందాలు, పేకాట శిబిరాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జీవోస్ హోంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, స్వయంగా ప్రజా ప్రతినిధు లే కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించడం దారుణమని, ప్రభుత్వం అటువంటి ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్‌లో అన్నదానం

గుడ్లవల్లేరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా సోమవారం గుడ్లవల్లేరు లయన్స్‌క్లబ్‌లో పేదల కు అన్నదానం నిర్వహించారు. అన్నదానాన్ని డాక్టర్ కె.ఎస్. కె శాయి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. శశికళ, పెరుమాళ్లు, ప్రసాద్ పాల్గొన్నారు.



నందివాడలో జరుగుతున్న కోడిపందేలు

జోరుగా కోడిపందేలు, పేకాట

● చేతులు మారిన లక్షల రూపాయలు ● పత్తాలేని పోలీసులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బరుల్లో అధికార పార్టీ సత్తా చాటింది. గత సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతిపక్ష పార్టీలకు బరిలను పెట్టకుండా హవాను చాటుకున్నారు. మూడు రోజులపాటు పందెంరాయుళ్లు, జూదగాళ్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సకల ఏర్పాట్లు చేశారు. విద్యుత్ కాంతులతో బరి ప్రాంగణం పగలను తలపిస్తోంది. గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా కోడిపందేలు, పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగాయి. ముఖ్యంగా గుడివాడ పట్టణం బైపాస్ రోడ్డులోని గౌతమ్ స్కూల్ వెనుక, గుడివాడ మండలం బొమ్ములూరులో భారీస్థాయిలో కోడిపం దాలు, పేకాట శిబిరాలను నిర్వహించారు. నందివాడ మండలంలోని నందివాడ, పుట్టగుం ట, పోలుకొండ, తమిరిశ, గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు, కౌతవరం, కుచ్చికాయలపూడి, అంగలూరు, కూరాడ, డోకిపర్రుల్లో కోడి పందేలు, పేకాట విచ్చ లవిడిగా నిర్వహించారు.

పామర్రు : సంక్రాంతి సంప్రదా య ముసుగులో పామర్రులో కోడిపందేలు ఇతర జూదక్రీడల జోరు ఉపందుకుంది. సంక్రాంతి ముసుగు లో జూదలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారుల హెచ్చరి కలు ఇక్కడ పనిచేయ లేదనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. స్థానిక గుడివాడ-పామర్రు ప్రధాన రహదారి పక్కన కొత్తపెదమద్దాలి ఇటుక బట్టీల వద్ద బరులు వేసి అధికార పార్టీ యువ నేతల ఆధ్వర్యంలో పందేలు కొనసాగిస్తున్నారు.



పామర్రు కొత్తపెదమద్దాలిలో..

పమిడిముక్కల : పమిడిముక్కల మండల పరిధిలో సోమవారం భోగి పండుగ రోజు కోడి పందేలు జోరుగా సాగాయి. గడ్డిపాడు, కపిలేశ్వరపురం గ్రామాల్లోని మా గాణి పొలాల్లో పెద్ద పెద్ద బరులు వేసి భారీగా పందేలు వేశారు. పుంజుల సైజు, రంగునుబట్టి పందేలు జరిగాయి. చిన్న బజర్, పెద్ద బజార్ ఆటలు ఆడేం దుకు యువకులు ఉత్సుకత చూపారు. పందేలు తిలకించేందుకు యువతులు, మహిళలు తరలిరాగా యువతులు బరిలో నిలచి పందేలు కాయడం విశేషం.



గరికపర్రులో ..

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండ లంలో సోమవారం భోగి పండుగనాడు సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందేల నిర్వహణ అట్టహాసంగా ప్రారంభమైంది. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, గరికపర్రు, కుమ్మమూరు గ్రామాల్లో కోడిపందేలు మొదలయ్యాయి. వల్లూరుపాలెంలో మండల టీ డీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ రిబ్బన్ కట్ చేశారు.



కపిలేశ్వపురం బరిలో కోడిపందేలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.515

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్ : స్థానిక నిజాంపేటలో ఉడిమిచెట్టు కింద 108 సంవత్సరాల క్రితం విజయ వనమలమ్మ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఫిబ్రవరి 3న జరుగుతుందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. సోమవారం వనమలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

నియామక పత్రాలు అందజేత

పెడన, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘంలో పదవులు పొందిన వారికి ఆ సంఘ అధ్యక్షుడు సన్నిధి నాగసాయి, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్నాలు సోమవారం పెడనలోని వాసవీ ప్రార్థనా మందిరంలో నియామక పత్రాలు అందచేశారు. మామిడి ప్రసాద్, ఆత్మకూరి సురేష్, కొత్త మురళీకృష్ణ, కొల్లూరి రాజా, చిలకల శ్రీనివాస గుప్తా తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు

జోరుగా కోడిపందేలు, జూదం

మచిలీపట్నం టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పెద్ద ఎత్తున కోడి పందేలు, జూదం జరిగాయి. బందరు మండలం మంగినపూడి, మేకావారి పాలెం గ్రామాల్లో జోరుగా కోడిపందేలు, జూదం జరిగాయి. పొలాల్లో బరులు గీసి కోడిపందేలు వేశారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలో నాలుగు చోట్ల భారీ బరులు ఏర్పాటు చేయగా, అవనిగడ్డ - పులిగడ్డ మధ్య ఏర్పాటు చేసిన బరిలో రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, మాజీ జడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావుతో కలిసి లాంఛనంగా కోడిపందేలను ప్రారంభించారు. పులిగడ్డ బరిలో రింగ్ పందేలు సాగాయి. **మోపిదేవి:** మండలంలోని పెదప్రోలు పంచాయతీ పరిధిలో ఓ ప్రైవేట్ వెంచర్‌లో కోడిపందేలు జోరుగా కొనసాగుతున్నాయి.



సంప్రదాయ కోడిపందేలు ప్రారంభిస్తున్న చిలకలపూడి పాపారావు



మోపిదేవిలో ...బరిలో కోడిపందెం

వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా పందెపు రాయుళ్లు తరలిరావటంతో యథేచ్ఛగా కొనసాగాయి. లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. **బంటుమిల్లి:** మండలంలో జోరుగా కోడి పందేలు నిర్వహించారు. లక్షాలాది రూపాయలు చేతుల మారాయి. పందేలకు కావల్సిన కోళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. మండలంలో బంటుమిల్లిలో రెండు, నాగేశ్వరరావుపేట ఒకటి, పెందుర్రు ఒకటి, అర్తమూరులో ఒకటి బరులు నిర్వహించారు. రాత్రులు కూడా విద్యుత్ దీపాల సహాయంతో పేకాట జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. **చల్లపల్లి:** మండల పరిధి వెలివోలులో కోడి పందేలు, జూదాల నిర్వహణకు బరులు వెలిశాయి. మండలంలోనూ బరులు ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్లు, జూదరులతో సందడిగా మారింది.

క్యాలెండర్ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్ , జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తూర్పు కృష్ణా ఎన్జీవోల సంఘ టేబుల్ క్యాలెండర్‌ను సోమవారం మచిలీపట్నంలో తన కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. మంత్రి రవీంద్ర జిల్లాలోని ఉద్యోగులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి శ్రీనివాస్, కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లి కృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి హేమ ప్రకాష్ , పి రాంబాబు, బి శ్రీకాంత్, రమాదేవి,శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గూడూరు, : మండల పరిధిలోని మల్లవోలు ముదిరాజుపాలెంకు చెందిన లక్ష్మీకాంతం అనే మహిళ దహన సంస్కారాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 5వేల ఆర్థిక సాయం అందచేసింది. అంత ర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడమల మోహన త్రినాథ్, ప్రతినిధులు పాల్గొన్నారు.



మేనమామ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

మంత్రి కొల్లు రవీంద్ర మేనమామ మృతి

మచిలీపట్నం టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మేనమామ తిరుమాని కృష్ణభగవాన్ (75) సోమవారం మృతిచెందారు. బందరుకోటలో కొల్లు రవీంద్ర మేనమామ తిరుమాని భగవాన్ అంత్యక్రియలు జరిగాయి. ఈ అంత్యక్రియల్లో కొల్లు రవీంద్ర, టీడీపీ మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్, బచ్చుల బోసుబాబు పాల్గొన్నారు. కృష్ణభగవాన్‌కు ఇద్దరు పిల్లలు. వారం రోజులుగా భగవాన్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరి మృతికి కొల్లు రవీంద్ర ప్రగాఢ సంతాపం తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెల్విన్ జోన్స్ జయంతి

చల్లపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతిని చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు పిలుపుమేరకు స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, నర్రా సాయిబాబు, ఉప్పల సాంబశివరావు, వేమూరి మురళీకృష్ణ, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా దేవి కల్యాణం

కోడూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో శ్రీమన్నారాయణ స్వామి ఆలయం వద్ద శ్రీ గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో 22 మంది దంపతులచే కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. బూరగడ్డ హరనాథ్ బాబు, జూపూడి సుబాష్ చంద్రబోస్, రాము, భక్తులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్: మండల పరిధిలోని మోదుమూడి శ్రీ కోదండ రామాలయం వద్ద బచ్చు జగదీష్ ప్రసాద్ - పృథ్విజ దంపతులు సోమవారం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మొవ్వ రఘుశేఖర్ ప్రసాద్‌పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు బచ్చు గగాధర్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అన్నసమారాధన జరిగింది.

పెడన రూరల్, జనవరి : కొప్పల్లిలో వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామికి, గోదాదేవికి పాసుర విన్నప, సహస్రనామ పూజ, సహస్ర చామంతుల పూజ నిర్వహించారు. చేవేంద్రలో మదనవేణుగోపాలస్వామి, చెన్నూరులో లక్ష్మీ నరశింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. పెనుమల్లి, నడుపూరు, చెన్నూరు, బల్లిపర్రు, కోటావానిపాలెం, కాకర్లమూడి పాలెం, నందమూరు, నందిగామ రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోడూరులో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం

చల్లపల్లి: స్థానిక శ్రీగరుడ ఆంజనేయ సహిత శ్రీవెంకటేశ్వరస్వామిదేవాలయంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వంతరాచార్యులు కల్యాణోత్సవాన్ని జరిపారు. అన్నసమారాధన నిర్వహించారు. ● శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలోని గీతామందిరంలో ఉడత సురేష్.మాధవి దంపతులచే పండితులు లంక చక్రపాణి కల్యాణోత్సవాన్ని జరిపించారు.

ఉత్సాహంగా భోగి పండుగ

చల్లపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సన్‌ఫ్లవర్ స్పెండర్ సిటీ రోడ్డులో స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమం సందడిగా నిర్వహించారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్‌కె. ప్రసాద్-డాక్టర్ పద్మావతి దంప తులు భోగి మంటలు వెలిగించారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు వీధిలోని మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. మండల వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.

భోగిమంటలు వేసిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్: తెలుగు ప్రజలందరికీ ఈ సంక్రాంతి పర్వదినం కొత్త వెలుగులు నింపాలని ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. సోమవారం ఉదయం తన ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి భోగిమంటలు వేశారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ్య, సీతారామయ్య పాల్గొన్నారు. **మోపిదేవి:** మండ లంలోని ఆయా గ్రామాల ప్రజలు ఉత్సాహంగా భోగి పండుగ జరుపుకున్నారు. తెల్లవారు జామునే ఇళ్ల వద్ద



గూడూరులో ...

భోగిమంటలు వేసి వేడుకలు ప్రారంభించారు. **నాగాయలంక:** మహిళలు తమ ముంగిళ్లలో రంగులతో ముగ్గులు వేసి సాదరంగా ఆహ్వానించారు. యువత భోగి మంటలు రగిల్చి ఆనందాలను వ్యక్తం చేశారు. **అవనిగడ్డ రూరల్:** అవనిగడ్డ మండలం లోని పలు ప్రాంతాల్లో భోగి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకనూరు పంచాయతీ ఉపసర్పంచ్ తుంగల మురళీకృష్ణ ఆధ్వర్యంలో యువకులు భోగి మంటలు వేశారు. **పెడన రూరల్ :** మండలంలోని గ్రామ కూడళ్లలో భోగి మంటలు వేశారు. గంగిరెద్దులు, హరిదాసు సంకీర్తనలతో పండగ శోభ పల్లెల్లో వెల్లివిరుస్తుంది. జడ్పీటీసీ అర్జా నగేష్, టీడీపీ



కుటుంబ సభ్యులతో కలిసి భోగి వేడుకల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. **మోపిదేవి:** నాగాయితిప్ప గ్రామంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ పోటీలు తిలకించారు. బహుమతులు అందించారు. **కృత్తివెన్ను:** గ్రామ ప్రధాన సెంటర్లలో, ఆలయాల వద్ద, ఇళ్ల వద్ద భోగి మంటను వేసుకున్నారు. భోగి పండ్లతో చిన్నారులను ఆశీర్వదించారు. **గూడూరు:** మండలంలో యువకులు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో భోగిమంటలు వేశారు. **బంటుమిల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు సంప్రదాయ రీతిలో భోగి మంటలు వేశారు.

వైభవంగా ఆరుద్రోత్సవం

మోపిదేవి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆరుద్రోత్సవం (శివముక్కోటి) పురస్కరించుకుని మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామికి విశేష



మోపిదేవిలో స్వామివారి గ్రామోత్సవం

పూజలు నిర్వహించారు. మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దుర్గానాగేశ్వరస్వామి వార్లను వాహనంపై గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించారు. **నాగాయలంక:** స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆరుద్రోత్సవం కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్:** మండల పరిధిలోని వేకనూరులో ఉన్న శ్రీ ఉభయ ముక్తీశ్వరస్వామి దేవాలయంలో శివ ముక్కోటి వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘంటసాల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్య ంలో మహా శివునికి ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించారు.